



# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 26

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

ఆదివారం 1 జూన్ 2025


## మాది పేదల కోసం పనిచేసే ప్రభుత్వం

● ఏడాదికి రూ.34 వేల కోట్లు పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే ● 3 గ్యాస్ సిలిండర్ల డబ్బులు అకౌంట్లో జమ చేస్తాం ● జూన్‌లో అన్నదాత, తల్లికి వందనం పథకాలు ప్రారంభం ● నరేగా పనులు పూర్తి చేసి గ్రామాల్లో వెలుగులు నింపుతాం ● ఏపీలో సీబీఎన్ ఉన్నాడు...పెట్టుబడులతో రమ్మని పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చా ● ప్రతినెలా 1వ తేదీ నుంచి 15 వరకు దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ ● దివ్యాంగులు, వృద్ధులకు ఇంటివద్దే అందజేత ● రేషన్ వద్దనుకున్న వారికి డీబీటీ పద్ధతిలో నగదు చెల్లింపు ● గత పాలకులు స్కీముల పేరుతో స్కాములు చేశారు ● -ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ● ముమ్మిడివరం నియోజకవర్గం, చెయ్యేరులో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొన్న సీఎం ● ఉపాధి హామీ శ్రామికులతో ముచ్చటించిన ముఖ్యమంత్రి





**ముమ్మిడివరం,కలంకౌంటర్ :** అధికారం చేపట్టిన 11 నెలల్లోనే కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలకు సంక్షేమం అందిస్తున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. దేశంలోనే ఏడాదికి రూ.34 వేల కోట్లు పింఛన్లకు ఖర్చు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే అని, భగవంతుడు కనికరిస్తే భవిష్యత్‌లో పెన్షన్లు పెంచుతామని చెప్పారు. అవినీతి లేని వ్యవస్థకు శ్రీకారం చుట్టామన్నారు. గత పాలకులు స్కీముల పేరుతో స్కాములు చేశారని, రాజకీయ ముసుగులో నేరాలు-ఘోరాలకు పాల్పడ్డారని అన్నారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. తప్పు చేసే వారిని చండశాసనుడిలా వెంటాడుతానని అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం చెయ్యేరులో పేదల సేవలో కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ శ్రామికులు రత్నమ్మ, మరియమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పింఛన్లు అందజేశారు. అనంతరం ప్రజావేదిక బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.





**పింఛన్లతో పేదల కళ్లలో ఆనందం..** మనది పేదల కోసం పనిచేసే ప్రభుత్వం. మన దేశంలో పింఛన్లు ప్రతి నెలా 64 లక్షల మందికి ఇస్తున్నాం. 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు అందించాం. గత ప్రభుత్వంలో ముక్కుతూ మూలుగుతూ పింఛన్లు ఇచ్చారు. రూ.200 పింఛన్ని రూ.2 వేలు చేసింది మన ప్రభుత్వమే. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రూ.3,000 పింఛను రూ 4000 వేలు చేశాను. డయాలసిస్ రోగులకు రూ.10 వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమ్మైన వారికి రూ.15 వేలు పింఛను ఇస్తూ మానవత్వాన్ని నిరూపించుకున్నాం. ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇచ్చినట్టే పింఛన్లూ అందిస్తున్నాము. భగవంతుడు కనికరిస్తే భవిష్యత్‌లో పెన్షన్లు పెంచుతాం. భర్త చనిపోతే భార్య కు పెన్షన్ ఇచ్చే కార్యక్రమా నికి శ్రీకారం. గత ప్రభుత్వంలో భర్త చనిపోతే భార్యకు వితంతు పింఛను ఇవ్వలేదు. నేడు 71,380 మందికి రూ. 4 వేలు అందించాము. భర్త చనిపోయిన వారు అనాథగా మిగిలిపోకూడదని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. అలాగే ఈ నెలలో 2 నెలల పింఛను కలిపి తీసుకునే లబ్ధిదారులు 1,22,975 మంది ఉండగా, 3 నెలల ఫింఛను కలిపి తీసుకునేవారు 9176 మంది ఉన్నారు. వీరికి రూ.111.41 కోట్లను విడుదల చేశాము. మనకంటే ధనిక రాష్ట్రాలున్నాయి. వారికి ఆదాయమూ ఎక్కువ వస్తోంది. కానీ వారికంటే మనమే ఎక్కువ పింఛను ఇస్తున్నాం. మహారాష్ట్రకు దేశంలోనే అన్ని రాష్ట్రాలకంటే ఎక్కువ ఆదాయం వస్తున్నప్పటికీ వారు పింఛను కింద ఇచ్చేది రూ. 1000 మాత్రమే. తెలంగాణలో రూ. 2,500 ఇస్తున్నారు. ప్రతి ఇంటికీ పెద్ద కొడుకుగా ఉంటానని నేను చెప్పిన మాట నిలబెట్టుకున్నాను. ఏడాదిలో 100 రోజులు కష్టపడితే రూ. 30 వేలు వస్తాయి. నేను నెలకు రూ. 4 వేలు లెక్కన 12 నెలల్లో రూ. 48 వేలు ఇస్తున్నాను. వారికొచ్చే ఆదాయం కంటే నేనిచ్చే పింఛనే

- 2లో

## నెప్పల్లి భూములు అన్నసత్రం కమిటీవే

### 150 ఏళ్లగా శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధీనంలోనే



**విజయవాడ,కలంకౌంటర్ :** దేవదాయ శాఖదిగా చెబుతున్న కృష్ణా జిల్లా నెప్పల్లి గ్రామంలో ఆర్ ఎస్ నెం 101లోని 4.41 ఎకరాల భూమి విజయ వాడలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీకి చెందిన భూమిగా ఆ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు బచ్చు వెంకటలక్ష్మీ వరప్రసాద్, బి. రాజేష్ చెప్పారు. ఈ సందర్భంగా అన్నసత్రం కమిటీ ప్రాం గణంలో నిర్వహించిన మీడియా సమా వేశంలో వారు మాట్లాడారు. 150 ఏళ్ల క్రితం విజ యవాడలో ఆర్యవైశ్య యాత్రికుల వసతి, భోజన సదుపాయాల కోసం శ్రీ కన్యకాపరమేశ్వరి అన్న సత్రం కమిటీ పేరుతో సంస్థను తమ పూర్వీకులు ఏర్పాటు చేశారన్నారు. దీన్ని ఆదర్శంగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆర్యవైశ్య సంస్థలు ఏర్పాటు చేశారన్నారు.

**ఆర్యవైశ్యులు భూములు ఇచ్చారు..** తమ సంస్థ కొనసాగించేందుకు అనేక మంది ఆర్యవైశ్యులు కొంత భూములను సంస్థకు అందిం చారన్నారు. ఆ క్రమంలో నెప్పల్లిలో తమకు 4.41 ఎకరాల భూమి ఉందన్నారు. 150 ఏళ్ల నుంచి తమ ఆధీనంలోనే అది కొనసాగుతోందని చెప్పారు. దాని పన్నులు తమ సంస్థే చెల్లిస్తోందన్నారు. సుమారు వంద ఏళ్లకు పూర్వం నుంచి ఒకే కుటుం బం మూడు తరాలుగా (ప్రస్తుతం దేవినేని దుర్గా ప్రసాద్) దానిని తమ సంస్థ నుంచి కౌలుకు తీసు కొని సాగు చేస్తోందన్నారు. దానికి సంబంధించి సుమారు 75 ఏళ్లుగా ఆ రశీదులు, రిజిస్టర్ అగ్రిమెం ట్లు, పాస్బుక్లు తమ వద్ద ఉన్నాయన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో వసతి, ఉచిత భోజన సదుపా యాలే కాకుండా శివరాత్రికి ఇంద్రకీలాద్రిపై కొలువున్న దుర్గమ్మకు, శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం (పాతశివాలయం) స్వామి వార్ల రథోత్సవాన్ని సుమారుగా 155 ఏళ్లగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 40 ఏళ్ల క్రితం వరకూ దుర్గమ్మ సన్నిధిలో శివరాత్రి ఉత్సవాలను సైతం తమ సంస్థ ఆధ్వర్యంలో పూర్వీకులు నిర్వహించే వారని గుర్తు చేశారు. ఇప్పటికీ పాతశివాలయం శివరాత్రి ఉత్సవాలను తమ సంస్థే నిర్వహిస్తుందన్నారు.

**పూర్తి ధార్మిక సంస్థగా..** ఈ సంస్థ వ్యక్తిగతమైనది కాదని, పూర్తిగా ధార్మిక సంస్థగా కొనసాగుతుందన్నారు. ఆ భూమిని ఎవరికీ తమ సంస్థ అమ్మలేదన్నారు. ముఖ్యంగా ఆ భూమి వివరాలను దేవదాయ శాఖ 43 రిజిస్ట్రా ర్లో కొత్తగా నమోదు చేసేందుకు చర్యలు తీసు కుంటున్నట్లుగా వస్తున్న వార్తలు తమ కమిటీని ఆశ్చర్యానికి లోను చేసిందన్నారు. దీనిపై ప్రభుత్వ పెద్దలకు తాము వివరాలను అందిస్తామన్నారు. సమావేశంలో కమిటీ ప్రముఖులు వల్లంకొండ ప్రసాద్, వీరమునిబ్రహ్మానందరావు, జగన్మోహన రావుగుప్తా, దొగిపర్తి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## టీ పెట్టి...ప్రజలతో మమేకమై...







**పాయకరావుపేట,కలంకౌంటర్ :** పాయకరావుపేటలోని నక్కపల్లి మండల ప్రజలతో హోం మంత్రి అనిత మమేకమయ్యాను. పెన్షన్ల పంపిణీ భాగంగా ఉద్ధండపురం గ్రామంలో ఆవాల గోవిందు నివాసానికి వెళ్లి కుటుంబసభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా టీ పెట్టించి అందరికి ఇచ్చారు. ఆ కుటుంబంలోని చిన్నారులను పలకరించి వారితో సమయం గడపడం సంతోషంగా ఉందనీ మంత్రి తెలిపారు.







# పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలి

**అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచన**



**అవనిగడ్డ,కలంకౌంటర్ :** పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులకు సూచించారు. శనివారం కోడూరులో ఆయన పర్యటించారు. సంత మార్కెట్ ఆవరణ పరిశీలించారు. ప్రతి వారం సంత జరిగిన తరువాతి రోజు ఉదయాన్నే మార్కెట్ ఆవరణ శుభ్రం చేయించేలా పంచాయతీ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎంపీడీఓ జీ.సుధాప్రవీణుకు సూచించారు. పారిశుధ్య చర్యల్లో లోపం లేకుండా ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇద్దరు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద పింఛన్లు అందచేశారు.

**పేదలకు ఠంచనుగా పింఛన్ ఇస్తున్నాం..** కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే పింఛన్ లబ్దిని పెంచి అమలు చేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఒకటో తేదీ ఆదివారం వస్తే ఒకరోజు ముందుగా నెలాఖరుకే పింఛన్లు అందిస్తూ కూటమి ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన రోగులతో పాటు పింఛనుపై ఆధారపడి బ్రతుకు సాగిస్తున్న 62,95,526 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా ఖచ్చితంగా సకాలంలో పెన్షన్ అందిస్తూ భరోసా కల్పిస్తోంద న్నారు.కార్యక్రమంలో ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకల పూడి పాపారావు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ మణింద్ర, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ పోలేరమ్మ తల్లి ఆదాయం రూ 22,17,367/-లు



**కామేపల్లి, కలంకౌంటర్ :** జరుగుమల్లి మండలం కామేపల్లి లోని ప్రసిద్ధి చెందిన శ్రీ పోలేరమ్మ వారి దేవస్థానం లో శనివారం ఆలయ ఈవో వై. బైరాగి చౌదరి ఆధ్వర్యంలో 18-11-24 నుండి30-5-25 వరకు ఆరు నెలల 12 రోజుల అమ్మవారి హుండీ ఆదాయం రూ 22,17,365/-లు, రెండు యూ ఎస్ డాలర్లు వచ్చాయని ఆలయ ఈవో బైరాగి చౌదరి తెలిపారు. వల్లూరమ్మ తల్లి దేవస్థానం ఆలయ ఈవో బి రమేష్ పర్యవేక్షణలో కందుకూరు శ్రీవారి సేవా సమితి సేవకులు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, గ్రామస్తులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఆలయ ఈవో బైరాగి చౌదరి ధన్యవాదాలు తెలిపారు.

# సీతారామస్వామి విగ్రహా ప్రతిష్టా కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి

**- ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు**



**వలేటివారిపాలెం,కలంకౌంటర్ :** వలేటివారిపాలెం మండలం చుండి పంచాయతీలోని కాకర్లపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ స్వామి విగ్రహా ప్రతిష్టా కార్యక్రమంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా వేద పండితులు ఎమ్మెల్యే కి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు వేద ఆశీర్వాదం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఇంటూరి నాగేశ్వరరావు కి గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై డప్పు వాయిద్యాలతో, బాణాసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు... ప్రత్యేక పూజలు అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, నల్లబోతుల కొండలరావు, హరికృష్ణ, లక్ష్మీ, బ్రహ్మయ్య, రమణయ్య, ఇతర నాయకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం..

**అమరావతి,కలంకౌంటర్ :** మచిలీపట్నంలో లైంగిక వేధింపులకు పాల్పడిన బాలిక కుటుంబానికి ఫోన్ చేసి పరామర్శించిన రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్మన్. బాధిత బాలికతో వీడియో కాల్ లో మాట్లాడి ధైర్యం నింపిన శైలజ రాయపాటి. ఘటనపై జిల్లా ఎస్పీతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిందితులు ఎంతటి వారైనా సరే తప్పని సరిగా శిక్షపడేలా చేస్తానని బాలిక కుటుంబానికి హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఇటువంటి దురాగతాలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# పేద ప్రజల కళ్లలో సంతోషమే కూటమి ప్రభుత్వ లక్ష్యం - మంత్రి కందుల దుర్గేష్





**నిడదవోలు,కలంకౌంటర్ :** కూటమి ప్రభుత్వం అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లతో నిరుపేదలకు భరోసా అందిస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శనివారం నిడదవోలు పట్టణంలోని 4,8 వ వార్డుల్లో పర్యటించిన మంత్రి దుర్గేష్ ఇంటింటికి వెళ్లి స్వయంగా లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజల సంతృప్త స్థాయిని అడిగి తెలుసుకున్నారు. సంతృప్త స్థాయి పెరగడానికి ఇచ్చిన హామీల అమలు చేయడమే కారణమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. జూన్ 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో ఒకరోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత పారదర్శకంగా పెన్షన్ల పంపిణీ ప్రక్రియ చేపట్టామన్నారు. ప్రజల సామాజిక భద్రత కూటమి ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సకాలంలో అందిస్తున్న వివిధ రకాల పెన్షన్లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు.గత ప్రభుత్వం చాలీచాలని పెన్షన్లు అందిస్తే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో అవ్వాతాతలకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.15,000 అందిస్తూ భరోసా కల్పిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రూ.2000 పెన్షన్ ను రూ.3000 చేయడానికి 5 ఏళ్ల సమయం తీసుకుంటే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ ను రూ.4000కు పెంచి ఇంటి వద్దనే అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఖజానాను పూర్తిగా ఖాళీ చేసి వెళ్లిందని అయినప్పటికీ ప్రస్తుతం ఆర్థిక సంక్షోభం ఉన్నా కూడా వాటిని లెక్కచేయకుండా పేద ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమం చేస్తున్నామన్నారు. నాడు కొందరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటింటికి పెన్షన్ అందివ్వరని దుష్ప్రచారం చేశారని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ -6 హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పాఠశాలలు తెరిచే నాటికి తల్లికి వందనం, ఆగస్టు 15న ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేస్తామన్నారు.

# యాసం చిట్టిబాబు ప్రతిపాదనకు మద్దతు తెలుపుతున్నాం దోవా..

**- దివిసీమలో ఉన్న రాజకీయ దళిత నేతలు సిగ్గుపడాలి, దోవా గోవర్ధన్.**



**అవనిగడ్డ,కలంకౌంటర్ :** అవనిగడ్డ నియోజకవం-గ్గంలో ఓ ముఖ్య నేత తెలుగుదేశం అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు సారథ్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, నందమూరి తారక రామారావుల విగ్రహాలను కలిపి నిర్మించాలని ప్రభుత్వ అనుమతులు కోరడాన్ని స్వాగతిస్తున్నాం అని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ అన్నారు శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అవనిగడ్డ పెద్ద వంతెన సెంటర్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలనేది మాకు పెద్ద కల, చాల కాలంగా కొందరు దళిత సంఘాల నేతలు ప్రభుత్వ అనుమతులు కోరుతూ ప్రయత్నాలు చేయడం జరిగింది, పూర్తి స్థాయి ప్రభుత్వ అనుమతులు లభించకపోడంతో దివిసీమలోని అంబేద్కర్ వాదులకు అది ఒక కలగా మిగిలింది, దీనిపై వివిధ రాజకీయ పార్టీలలోని దళిత నేతలు ఏనాడు స్పందించలేదు, ఇప్పుడు ఓ రాజకీయ నేత ముందుకు రావడం గమనార్హం అందువల్ల వారికి మేము పూర్తి సహకారం అందిస్తామన్నారు.రాజ్యాంగ నిర్మాత కల్పించిన హక్కులు పొందుకుంటూ వివిధ రాజకీయ పార్టీల్లో రాజకీయ పదవులు అనుభవించిన వారు ఏనాడు ఇలాంటి ప్రయత్నం చేయకపోవడంపై చర్చ మెదలైంది ఎవరి చిత్తశుద్ధి ఏంటో ప్రజలే గుర్తిస్తారు. బడుగు బలహీన వర్గాలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ, రంగాల్లో ఎదిగేందుకు వెసులుబాటు కల్పించిన మహనీయుడి విగ్రహం ఏర్పాటుకు కృషి చేయడంలో దళిత రాజకీయ నేతలు ముందుకు రాకపోయినా ఇతర వర్గాలలోని నేతలు ముందుకు రావడం మంచి మార్పుకు నాంది ఇందుకు తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు

# సేవలకు సన్మానం

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రహదారులు , భవనాల శాఖలో 48 సంవత్సరాలు సుదీర్ఘకాలం వాచ్ మెన్ గా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ చేస్తున్న నంగిగడ్డ తిరుమల నాగరాజు అభినందన కార్యక్రమంలో పాల్గొని నంగి గడ్డ తిరు మల నాగరాజు దంపతులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేసిన మాజీ పార్లమెంట్ సభ్యులు రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు లిరాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు కొనకళ్ళ జగన్నాథరావు (బుల్లయ్య)లి మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు గడ్డంరాజు ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు, బంధుమిత్రులు పాల్గొని అభినందనలు తెలిపారు.



# శిద్దా కుటుంబంపై అభిమానం చాటుకున్న జిల్లా వాసులు

**- శ్రీశైలం వేద పండితుల ఆశీర్వచనం**









**(రవికుమార్)**

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి ల వివాహ వార్షికోత్సవ వేడుకలు చీమకుర్తి హరిహర క్షేత్రంలో శిద్దా అభిమానుల మధ్య ఘనంగా జరిగాయి. తొలుత హరిహర క్షేత్రంలో రాఘవరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిమానులు ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.శిద్దా అభిమానులు గజమాలతో పూల కిరీటాలతో రాఘవరావు, లక్ష్మీ పద్మావతి లను ఘనంగా సన్మానించారు. పెళ్లి రోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు దంపతులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీశైలం వేద పండితులు రాఘవరావు దంపతులను, సుధీర్ కుమార్, వారి కుటుంబ సభ్యులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దర్శి నుంచి వచ్చిన శిద్దా అభిమానులు,శిద్దా కుటుంబ సభ్యులు, మందాది సుబ్బారావు,ఆర్యవైశ్య సంఘం నాయకులు చలువాది బద్రి నారాయణ, గునుపూడి భాస్కర్, పల్లపోతు వెంకటేశ్వర్లు, జలదంకి వెంకటకృష్ణారావు, అమరాభాను, బొగ్గవరపు సుబ్బారావు, నూకల సుబ్రమణ్యం, వంకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మాది పేదల కోసం పనిచేసే ప్రభుత్వం

**-ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**



(మొదటిపేజీ తరువాయి)

ఎక్కువ.

**దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ..** జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ చేయబోతున్నాము. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటివద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేస్తాము. రేషన్ వద్దనుకునే వారికి డీబీటీ పద్ధతిలో నగదు ఇస్తాము. గతంలో డోర్ డెలివరీ పేరిట ఇచ్చినట్లే ఇచ్చి మళ్లీ వాళ్లే తీసుకుని కాకినాడ పోర్టుకు తీసుకొచ్చి మాఫియా రాజ్యాన్ని నడిపారు.

**అండగా ఉండి ఆదుకుంటాం..** కోనసీమలో వరి ఎక్కువ పండటంతో ఇక్కడి ప్రజలు ఎక్కువగా రైస్ తిని అనారోగ్యం పాలవుతున్నారు. డయాబెటీస్ వల్ల పోలిశెట్టి దుర్గాప్రసాద్ కాలు కోల్పోయాడు. అతనికి పింఛను మంజూరు చేస్తున్నాను. బీటెక్ చదివిన అతని కుమార్తె సత్య అనితకు ప్రభుత్వం తరపున రూ. లక్షా 50 వేలు , ఉద్యోగం ఇస్తాము. అలాగే బీఎస్సీ కంప్యూటర్స్ చేసిన సాయి లక్ష్మీ చంద్రకు కూడా ఉద్యోగం ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది.

రాష్ట్రంలో 5 లక్షలమంది వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారు. దీనిపై మరింత శ్రద్ధ పెడతాము.

**నాలుగు నెలలకు ఒకసారి గ్యాస్ డబ్బులు..** ఈ ఏడాది జూన్‌లో డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి పోస్టింగులు ఇస్తాం. తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేలు చొప్పున జమ చేస్తాం. అన్నదాత కింద అర్హులైన ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేలు ఇస్తాం. మత్స్యకారుల పొట్టగొట్టే 217 జీవో రద్దు చేశాం. మత్సకారుల సేవలో భాగంగా రూ.20వేలు ఆర్థిక సాయం అందిస్తున్నాం. రూ.5 కే అన్నా క్యాంటీన్ల ద్వారా పేదలకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నాం. త్వరలో నియోజకవర్గానికో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ రీయింబర్స్ మెంట్ కు ఉత్తర్వులు ఇచ్చాం. పవర్ లూమ్ లకు 500, హ్యాండ్ లూమ్‌కు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాము. స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేశాము. గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలు కేటాయించాము. ఎస్సీ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం సాధించాము. దేవాలయాల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులను పాలకమండళ్ల సభ్యులుగా నియమించాము. వేద విద్య అభ్యసించే నిరుద్యోగులకు యువగళం కింద నెలకు రూ.3 వేలు ఇస్తున్నాము. దీపం పథకం కింద ఆడబిడ్డలకు 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాము. ఇకపై ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఆడబిడ్డల అకౌంట్‌కే నేరుగా గ్యాస్ డబ్బులు జమ చేస్తాం.

**వెనకబడిన వర్గాలకు ఆర్థిక చేయూత..** వెనకబడిన వర్గాల కోసం పనిచేసే పార్టీ తెలుగుదేశం. మొన్నటి బడ్జెట్ లో బీసీలకు రూ.47,456 వేల కోట్లు వీరి అభివృద్ధికి కేటాయించాము. అధికారంలోకి రాగానే ధాన్యం రైతులకు రూ.1,670 కోట్లు విడుదల చేశాం. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నాం. గత ప్రభుత్వంలో పంచాయతీలకు రూ.990 కోట్లు బకాయిలు పెట్టి పోయారు. ఆ డబ్బులు ఇచ్చి ఫైనాన్స్ కమిషన్ డబ్బులు తెచ్చాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఒక్క రోజులోనే అన్ని పంచాయతీల్లో పనులు ప్రారంభించారు. పల్లె పండుగ కింద రూ.4,500 కోట్లు వెచ్చించి 30 వేల పనులకు శ్రీకారం చుట్టాం. ఇప్పుడు మళ్లీ ప్రారంభిస్తున్నాం. వాట్సాప్ సేవలకు శ్రీకారం చుట్టాం. నరేగా పనులు పూర్తి చేసి గ్రామాల్లో వెలుగులు తెస్తున్నాం. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 94 పథకాలకు కేంద్రం ఇచ్చిన డబ్బులు దారి మళ్లించి రాష్ట్రాన్ని బ్లాక్ లిస్ట్ లో పెట్టే పరిస్థితి తెచ్చారు. వీళ్ల దుర్వినియోగం చేసిన డబ్బులు తిరిగి చెల్లించి కేంద్ర పథకాలు పునరుద్ధరించాం. ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి విద్యుదుత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సోలార్ రూఫ్ టాప్ పథకం కింద 35 లక్షల కుటుంబాలకు సౌర విద్యుత్ యూనిట్లు ఇవ్వాలనుకుంటున్నాం. అనుమతులు రాగానే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10 వేల సూర్యఘర్ యూనిట్లు ఇస్తాం. ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్ల వరకు సౌర ప్యానెళ్లు ఉచితంగా ఇస్తాం. బీసీలకు కేంద్రం ఇచ్చే సబ్సిడీకి అదనంగా రూ.20 వేలు సమకూరుస్తాం. కరెంటు ఉత్పత్తి చేసుకుని ఎలక్ట్రికల్ వాహనాలు కూడా ఉపయోగించుకోవచ్చు.

**మహిళా భద్రతకు ప్రత్యేక చర్యలు..** మహిళల భద్రతకు శక్తి టీం లు ఏర్పాటు చేశాం. గత ప్రభుత్వంలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా దొరికింది. డగ్స్ అమ్మినా, తీసుకున్నా తాటతీస్తాను. ఈగల్ వ్యవస్థ తెచ్చి కట్టడి చేశాం. గత ప్రభుత్వం ఐదేళ్లలో కనీసం ఒక్క రోడ్డు కూడా వేయలేదు. రాష్ట్రమంతటా రోడ్లపై గోతులు పెట్టి పోయారు. ఆ గోతులు పూడ్చేందుకు రూ.1,200 కోట్లు ఖర్చయింది. 20 వేల కిలోమీటర్ల రోడ్లు మరమ్మతులు చేశాం. గత ప్రభుత్వంలో చెత్త పైనా పన్ను వేశారుకానీ చెత్త మాత్రం తీయలేదు. మేం రాగానే చెత్త పన్ను రద్దు చేశాము. 83 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఈ ఏడాది అక్టోబర్ నాటికి తీసేస్తాం. ఆర్య వైశ్యుల ఇలవేల్పు కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నాం. అమరావతిలో ఐదు ఎకరాల్లో పొట్టి శ్రీరాములు విగ్రహం నెలకొల్పుతాం. టీచర్ల కు మేలు జరిగేందుకు 177 జీవో రద్దు చేశాం. పోలీసులకు రూ. 213 కోట్ల సరండర్ లీవ్ లకు డబ్బులు ఇచ్చాం. ఉద్యోగుల డబ్బులు, ప్రావిడెంట్ ఫండ్ లు గత పాలకులు వాడేసుకున్నారు. మేం అధికారంలోకి వచ్చాక రూ.7,500 కోట్లు చెల్లించాం. అంగన్వాడీ , ఆశాలకు రూ. లక్షా5 0 వేల మేర లబ్ధి చేకూర్చేలా గ్యాట్యుటీ ఇచ్చాం. నవజాత శిశువులు కోసం 11 వస్తువులతో ఎన్టీఆర్ బేబీ కిట్లు తెస్తున్నాం. యువత కోసం పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. 20 లక్షల ఉద్యోగాల హామీ నిలబెట్టుకుంటాను. ఏపీలో ఎలా పెట్టుబడులు పెట్టాలని ఢిల్లీలో పారిశ్రామికవేత్తలు అడిగారు. ఇక్కడ సీబీఎన్ ఉన్నాడు...రండి అని చెప్పాను. జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. ప్రతి ఒక్కరూ ఇద్దరికంటే తక్కువ కాకుండా పిల్లల్ని కనాలి.

**కోనసీమ ఒకప్పుడు అందాలసీమ..** కోనసీమ ఒకప్పుడు అందాలసీమ. ఇక్కడ తలసరి ఆదాయం తగ్గింది. తలసరి ఆదాయం, అభివృద్ధిలో కోనసీమ కంటే అనంతపురం ముందుంది. ఆక్వా పెంపకం, కొబ్బరి తోటల సాగుతో కొంత వరకే ఆదాయం వస్తోంది. పాడి పరిశ్రమలు కూడా అభివృద్ధి కావాలి. కోకో వేస్తే అదనపు ఆదాయం వస్తుంది. 90 వేల ఎకరాల్లో కొబ్బరి సాగువుతోంది. వీటిలో కోకో లేదా పశుగ్రాసం వేస్తే ఆదాయం రెట్టింపవుతుంది.

# దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డ్ ల దౌర్జన్యం విషయం మంత్రి కొల్లు రవీంద్ర కు ఫిర్యాదు చేశారు.. బాసినంపాడు గ్రామం నుంచి గురువారం రాత్రి వైద్యం నిమిత్తం బట్రాజు నాంచారమ్మ ను మచిలీపట్నం ఆస్పత్రిలో చేర్పించారు. శుక్రవారం రోగి భర్త బట్రాజు స్వాములు, కుమారుడు బట్రాజు అయ్యప్ప హెూటల్ నుంచి భోజనం తెచ్చుకొని టు వీలర్ వెహికల్ ని పార్కింగ్ చేస్తుండగా,సెక్యూరిటీ గార్డ్ కిరణ్ వచ్చి బండి ఇక్కడ పెట్టకూడదు వేరే చోట పెట్టుకోమని చెప్పగా మాకు తెలియదు తీసేస్తున్నాము అని చెప్పి బండి తీస్తుండగా, ఎంతసేపురా మీరు బండి తీసేది అని దుర్భాషలాడి చేతిలో ఉన్న భోజనం పార్సిల్ ను లాక్కొని దూరముగా విసిరేసి, రోగి భర్త,కుమారునిపై దాడి చేసి,దౌర్జన్యం చేసారు. బాధితులు పెడన నియోజకవర్గం బాసినంపాడు గ్రామ వాస్తవ్యులు అవడంతో వారికి ఏమి చేయాలో తెలియక,చివరకు బందరు యాదవ సంఘ అధ్యక్షులు పల్లపాటి చినబాబు ని కలవగా స్పందించి రాష్ట్ర గనులు,భూగర్భ, ఎక్సైజ్ శాఖమంత్రి మంత్రి కొల్లు రవీంద్ర వద్దకు బాధితులను తీసుకుని వెళ్లి అర్జీ అందజేశారు. దీనిపై మంత్రి తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకుంటాన నీ హామీ ఇచ్చారు.

# పోలీసుశాఖకు మీరందించిన సేవలు ఎంతో విలువైనవి - జిల్లా ఎస్పీ వకుల్ జిందల్





**విజయనగరం,కలంకౌంటర్ :** సుదీర్ఘ కాలం పోలీసుశాఖలో బాధ్యతాయుతంగా ఎంతో క్రమ శిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఆర్మడ్ రిజర్వు విభానికి చెందిన (1) ఆర్.ఎస్.ఐ. సంపతిరావు వెంకట రమణరావు పాత్రుడు (2) ఎ.ఆర్.ఎస్.ఐ. వెంకటేశ్వరరావు (3) హెడ్ కానిస్టేబులు భావన శంకరరావు లకు జిల్లా పోలీసుశాఖ తరుపున జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా "ఆత్మీయ వీడ్కోలు" పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - శాంతిభద్రతల పరిరక్షణలో ఆర్మ్ డ్ రిజర్వు విభాగం చాలా క్రియాశీలకమైనదని, అటువంటి విభాగంలో సమర్ధవంతంగా, ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహించిన ముగ్గురు పోలీసు అధికారులు ఉద్యోగ విరమణ చేయడం జిల్లా పోలీసుశాఖకు తీరని లోటేనన్నారు. మావోయిస్టులు కార్యాకలాపాలను నియంత్రించుటలోను, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టుటలో ఎటువంటి రిమార్కులు లేకుండా 35-40 సం.లు పోలీసుశాఖకు సేవలందించడం అభినందనీయమన్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు, కుటుంబ బాధ్యతలను కూడా చక్కగా నిర్వర్తించి, వారి పిల్లలను మంచి విద్యావంతులుగా తీర్చిదిద్ది, వారు ఉన్నత స్థానంలో నిలిచేలా చేసారన్నారు. ఉద్యోగ విరమణ తరువాత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, కుటుంబంతో కొంత సమయాన్ని గడపాలని, సమాజానికి మంచి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన తరువాత బెనిఫిట్స్ రావడంలో ఇబ్బందులు తలెత్తితే వాటిని పరిష్కరించేందుకు రిటైర్డ్ ఉద్యోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్న భరోసాను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ కల్పించారు. అనంతరం, ఉద్యోగ విరమణ చేసిన ఆర్ఎస్ఐ ఎస్.వి.ఆర్. పాత్రుడు, ఎఆర్ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు మరియు ఎఆర్ హెచ్సీ భావన శంకరరావు దంపతులను జిల్లా పోలీసుశాఖ తరుపున జిల్లా ఎస్పీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ ఎఆర్ జి.నాగేశ్వరరావు, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.కె.చౌదరి, రిజర్వు ఇన్స్పెక్టర్లు ఎన్.గోపాల నాయుడు, టి.శ్రీనివాసరావు, ఆర్.రమేష్ కుమార్, పలువురు ఆర్.ఎస్.ఐ.లు పోలీసు అసోసియేషను అధ్యక్షులు కే.శ్రీనివాసరావు , ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని, ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

# మజ్జిగ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం ఉదయపు నడక మిత్ర మండలి మహిళా విభాగం ఆధ్వర్యంలో 24వ రోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి సహకరించిన వారు పులవర్తి నాగేశ్వరరావు . ఈ కార్యక్రమం లో అధ్యక్షులు జల్దు మురళి నాథ్ ,ట్రెజరర్ వేద లక్ష్మి నరసింహం, జోన్ చైర్మన్ కారుమూరి రాజేంద్రప్రసాద్ ,వంకాయల నాగపోతరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట లో పాల్గొన్న మంత్రి స్వామి



**ఒంగోలు, కలంకౌంటర్ :** ప్రకాశం జిల్లా జరుగుమల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు మంత్రి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఆంజనేయ స్వామి అనుగ్రహం అందరికీ ఉండాలని అని ఆకాంక్షించారు.

# అత్తిలి రోశయ్య కు సముచిత స్థానం



**తణుకు,కలంకౌంటర్ :** వైసీపీ స్టేట్ వాణిజ్య విభాగం జోనల్ ప్రెసిడెంట్ గా తణుకు నియోజకవర్గం అత్తిలి కి చెందిన కంకటాల రోశయ్య ను నియమిస్తూ వైసీపీ అధిష్టానం ప్రకటన చేసింది.గతంలో ద్వారకా తిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ గా చేశారు.పార్టీ కి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరావు కి విధేయుడు.పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ మంచి కార్యకర్తగా గుర్తింపు పొందారు.ఈ సందర్భంగా రోశయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన పార్టీ అధినేత వై ఎస్ జగన్,రావడానికి కారణమైన మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరావు ,పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు.

# పదో తరగతి మెరిట్ విద్యార్థినికి రూ.10వేలు నగదు ప్రోత్సాహకం అందజేత



**అవనిగడ్డ,కలంకౌంటర్ :** కోడూరు ఎస్సీ కాలనీకి చెందిన పదో తరగతి మెరిట్ విద్యార్థిని బత్తుల ప్రవల్లికకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రూ.10 వేలు నగదు ప్రోత్సాహకం అందించారు. అవనిగడ్డ నియోజక వర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ విద్యార్థులకు దివిసీమ భీమ్ జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఒకరికి రూ.10 వేలు నగదు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం 578 మార్కులు సాధించిన కోడూరు స్వతంత్ర్యపురం హైస్కూల్ విద్యార్థిని ప్రవల్లికకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చేతుల మీదుగా నగదును అందించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రవల్లికకు ఎమ్మెల్యే దుశ్శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల నుంచి దివిసీమ భీమ్ జీ అసోసియేషన్ నిర్వాహకులు పోలాబత్తిన బిపిన్ చంద్రపాల్ మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించడం అభినందనీయం అన్నారు. అసోసియేషన్ ద్వారా ఆయన చేపట్టిన పలు సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే కొనియాడారు. ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని మరికొంత మంది సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పోలాబత్తిన గోపాలం, విద్యార్థిని తండ్రి రాజు పాల్గొన్నారు.

# టాక్సీ డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించిన - జనసేన..





**తిరుపతి,కలంకౌంటర్ :** తిరుమల తిరుపతి టాక్సీ డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులను.. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దృష్టికి వారు తీసుకురాగా.. ఎమ్మెల్యే ఆరణి ఆదేశాల మేరకు శనివారం తిరుపతి జనసేన పార్టీ నగర అధ్యక్షుడు రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేష్ యాదవ్ ల ఆధ్వర్యంలో.. సెక్టర్ 3 సైలేంద్ర కుమార్ ను కలిసి డ్రైవర్లు పడుతున్న కష్టాలు వివరించి, వెంటనే వారికి ఉపశమనం కలిగించాలని, జీబు ఓనర్లకు, డ్రైవర్లకు న్యాయం చేయాలని కోరగా.. తక్షణమే స్పందించి టాక్సీ, జీబ్, డ్రైవర్లకు, ఓనర్లకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అదే విధంగా తిరుమల ట్రాఫిక్ సిఐ ను కూడా కలిసి వారికి ట్రాఫిక్ సమస్యలపై, డ్రైవర్లు పడుతున్న సమస్యలపై వివరించి, పదేపదే చలానాలు వేయడం వల్ల వారు సంపాదించింది ఇంటికి కూడా తీసుకొని వెళ్లలేకపోతున్నారని, దీనిపై చర్యలు చేపట్టి తగిన న్యాయం చేకూర్చాలని జనసేన నేతలు కోరగా.. సిఐ సానుకూలంగా స్పందించి, మరొకసారి ఇలా జరగకుండా చూస్తామని హామీ ఇచ్చి, జీప్ డ్రైవర్లు, ఓనర్లు ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ.. అవసరమైన డాక్యుమెంటేషన్ ను సరిగా పెట్టుకోవాలని, రూల్స్ అతిక్రమించకుండా చూసుకోవాలని తెలపగా.. యూనియన్ లీడర్లు రికార్డ్స్ సరిగా పెట్టుకుని, రూల్స్ ను అతిక్రమించకుండా నడుపుకోవాలని జీబు డ్రైవర్లకు, ఓనర్లకు ఆదేశాలు జారీ చేశారు.

# పది రోజుల్లోనే లక్ష్యసాధనలో సగం దాటిన యోగాంధ్ర

## కోటి మందికి పైగా పేర్లు నమోదు

**అమరావతి,కలంకౌంటర్ :** యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వా ములయ్యేందుకు నమోదు చేసుకునే వారి సంఖ్య నమోదు ప్రారంభించిన పది రోజుల్లోనే లక్ష్యసాధనలో సగాని కి పైగా దాటింది. ఈ కార్యక్రమం లో 2 కోట్ల మందిని భాగస్వాములను చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా శుక్రవారం నాటికే ఇందులో పాల్గొనేందుకు సుముఖత వ్యక్తం చేస్తూ కోటిమందికి పైగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 నాటికి 2 కోట్ల లక్ష్యాన్ని చేరుకుంటామని అధికారులు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రారంభించిన 'యోగాంధ్ర' ప్రచార కార్యక్రమానికి ప్రజల నుండి రోజురోజుకూ పెరుగుతున్న స్పందనతో మొదటి 10 రోజుల్లో కోటి మందికి పైగా యోగా ఔత్సాహికులు పాల్గొనడానికి తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం నెల రోజుల పాటు నిర్వహించే యోగాంధ్రలో 2 కోట్ల రిజిస్ట్రేషన్ల లక్ష్యానికి గాను, శుక్రవారం రాత్రి నాటికి సగం మార్కును దాటి 1,13,47,935 మంది స్వచ్ఛందంగా నమోదు చేసుకున్నారని వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, యోగాంధ్ర రాష్ట్ర నోడల్ అధికారి ఎం.టి.కృష్ణబాబు శుక్రవారం రాత్రి మంత్రుల కమిటీకి నివేదిం చారు.

# 3,4,5,6,తేదీలలో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక కార్యక్రమాలు



**అవనిగడ్డ ,కలంకౌంటర్ :** అవనిగడ్డ మండల పరిధిలో తుంగలవారిపాలెం గ్రామంలో 3,4,5,6,తేదీలలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ కృష్ణాజిల్లా శాఖఆధ్వర్యంలో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అవనిగడ్డ మండల ధర్మచార్యులు అన్నపరెడ్డి కృష్ణ శనివారం విలేకరులకు తెలిపారు అవనిగడ్డ మండల పరిధిలోని తుంగలవారిపాలెం గ్రామంలో శ్రీ కోదండ రామాలయం దేవాలయం నందు జరిగే కార్యక్రమాలలో భాగంగా 3 వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటలకు రామాయణం సింహాద్రి పద్మ చెప్తారు అనంతరము స్థానిక భక్త బృందంచే భజన కార్యక్రమం జరుగుతుందని అన్నారు అదేవిధంగా 4వ తేదీ బుధవారం 6 గంటలకు మహాభారత ఉపన్యాసం సింహాద్రి పద్మ చెబుతారు అనంతరం భజన కార్యక్రమం జరుగుతుందని 5వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటలకు భగవద్గీత ఉపన్యాసం సింహాద్రి పద్మ చెబుతారు భజన కార్యక్రమాలు జరుగుతాయని 6వ తారీకు శుక్రవారంఉదయం 9గం సుహాసినిలచే సామూహిక కుమార్చన కార్యక్రమునకు కావలసిన పూజా సామాగ్రి లక్ష్మీ దేవి రూపు కంకనములు పసుపు కుంకుమ తిరుమల తిరుపతి దేవస్థానం వారే అందజేస్తారని ధర్మచార్యులు తెలిపారు ప్రతిరోజు సీతారాములవారికి ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించి విశేషంగా అలంకరిస్తారు అన్నారు కుంకుమ పూజా కార్యక్రమం దేవస్థానం అర్చక పండితులు దీవి మురళీకృష్ణ నిర్వహిస్తారన్నారు కావున భక్తులు నాలుగు రోజులు జరిగే ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కృష్ణ కోరారు ఈ సందర్భంగా కార్యక్రమాలకు సంబంధించి కరపత్రాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం అవనిగడ్డ మండల ధర్మచార్యులు అన్నపరెడ్డి కృష్ణ మోపిదేవి మండల ధర్మాచార్యులు గరికిపాటి వీరాంజనేయులు విశ్వహిందూ పరిషత్ ప్రాంత సమరసత సహప్రముఖ్ లింగం బసవ శంకర్రావు ఆలయ అర్చక పండితులు దీవి మురళీకృష్ణ భజన సంఘంవారితో పాటుపలువురు భక్తులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడలు ముఖ్యం - ఎస్పీ గంగాధరరావు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** వేసవికాలం వచ్చిందంటే చాలు పిల్లలు ఎర్రటి ఎండలో నిరంతరం ఆటలకు పరుగులు తీస్తూ ఆరోగ్యాన్ని పాడు చేసుకోవడమే కాక సమయాన్ని కూడా వృధా చేసుకుంటున్నారు.అలా ఈ వేసవి కాలాన్ని వృధాగా పోనివ్వకుండా ఏదైనా ఒక క్రీడలో అత్యంత ప్రతిభ కలిగిన వారిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కృష్ణాజిల్లా పోలీస్ ఆధ్వర్యంలో ఉచిత బాస్కెట్ బాల్ శిక్షణ తరగతులను నిర్వహించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ నందు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పర్యవేక్షణలో, డి ఎస్ డి ఓ ఝాన్సీ తోడ్పాటు తో 45 రోజులపాటు నిర్వహించిన ఉచిత వేసవికాలం బాస్కెట్ బాల్ శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిసాయి. ఈ శిక్షణా తరగతులకు మొత్తం 110 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. వారందరికీ హెడ్ కానిస్టేబుల్ సుధీర్ ప్రత్యేక చొరవతో అత్యుత్తమ శిక్షణ, ఆటలో మెలకువలు నేర్పించారు. బాస్కెట్ బాల్ శిక్షణా తరగతులకు హాజరైన విద్యార్థులందరికీ జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేసి వారందరికీ అభినందనలు తెలిపారు. డర్మటాలజిస్ట్ అండ్ హెయిర్ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ డాక్టర్.ఉష్మా కంఠమనేని టీ షర్టులను స్పాన్సర్ చేయగా వాటిని ఎస్పీ విద్యార్థులకు అందజేసారు. ఎస్పీ విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువు ఎంత ప్రాముఖ్యత ఉందో క్రీడలు కూడా అంతే ప్రాముఖ్యత కలిగి ఉంటాయని చదువుతోపాటు సమానంగా క్రీడలను అలవాటు చేసుకోవాలని అన్నారు.



# సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం - మంత్రి కొల్లు రవీంద్ర




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం ఉదయం రాష్ట్ర మంత్రివర్యులు నగరంలోని వారి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మంత్రి ప్రజల సమస్యలను ఎంతో ఓపికగా ఆలకించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ప్రతి శుక్రవారం శాసనసభ్యులు ప్రజ లకు అందుబాటులో ఉండి వారి నియోజకవర్గంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజా సమస్యలు తీర్చాలని సూచించారన్నారు. ఇందులో భాగంగానే శనివారం ప్రజా దర్బార్ నిర్వహి ంచామని ఇప్పటిదాకా 100 అర్జీలు వచ్చాయని వాటన్నిటిని పరిష్కరించాలని కోరుతూ సంబం ధిత అధికారులకు వాటిని పంపిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా పనిచేస్తున్నామన్నారు. అర్జీలలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రధాన సమ స్యలైన రెవెన్యూ, భూమి,ఇళ్ల స్థలాలు, డ్రైనేజీ, గుంతల రహదారులు వంటి ప్రధాన సమస్యలు ఉన్నాయన్నారు. వచ్చే జూన్ నెల 12 వ తేదీన కొత్తగా 95 వేల మందికి పింఛన్లు ఇవ్వబోతున్నామన్నారు. రేషన్ కార్డులు కూడా సరిచేసి కొత్తవి ఇవ్వడం జరుగుతుందన్నారు నిత్యావసర సరుకులు ఎండీయూ వాహనాల ద్వారా సరిగా పంపిణీ కాకపోవడంతో వాటిని నిలుపుదల చేసి వచ్చే జూన్ నెల 1 వ తేదీ నుండి పూర్వ పద్ధతిలోనే చౌక దుకాణాల ద్వారా ఆ సరుకులను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రజలు వారికి వీలైన సమయంలో చౌక దుకాణాలకు వెళ్లి కావలసిన సరుకులు తెచ్చుకునే సౌలభ్యం ఉందన్నారు. పేదలకు కళ్ళు దెబ్బ తినకుండా ఉండాలనే ఉద్దేశంతో తొలిదశలో దీపం-1 పథకం కింద కోటి గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయడం జరిగిందన్నారు. దీపం 2 పథకం కింద ప్రస్తుతం ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నామన్నారు. వచ్చే జూన్ మాసంలో పాఠశాలలు తెరిచే సమయానికి తల్లికి వందనం పథకం కింద విద్యార్థుల చదువు కోసం 15 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. అలాగే పట్టెడన్నం పెడుతున్న రైతన్నలను ఆదుకోవాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 6000 రూపాయలకు మరో 14 వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం జోడించి మొత్తం 20 వేల రూపాయలను అన్నదాత సుఖీభవ పథకం కింద 3 విడతల్లో ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద 78 వేల రూపాయల వరకు రాయితీ ఉంటుందని, ఎస్సీలు ఎస్టీలకు ఉచితంగా, బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం మరో 20000 రూపాయలు కలిపి మొత్తం 98 వేల రూపాయలు రాయితీ ఇస్తుందన్నారు. నియోజకవర్గానికి 10,000 కనెక్షన్లు ఇస్తున్నామని ఇంకా అవసరమైతే అదనంగా కనెక్షన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిగులు విద్యుత్ ఉత్పత్తి అయితే గ్రిడ్డుకు వెళ్తుందని తద్వారా వినియోగదారులకు అదనపు ఆదాయం కూడా వస్తుందన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య సేవలు కింద పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని నియోజకవర్గంలో 1.90 కోట్ల రూపాయలు పరిహారం మంజూరు అయిందన్నారు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలందరూ సహకారం అందించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరపల్లి అనిత, స్థానిక ప్రముఖ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్, ఎల్ వెంకటస్వామి బచ్చుల అనిల్ కుమార్ తదితర అనధికారులు పాల్గొన్నారు.

# పేదల పక్షం కూటమి ప్రభుత్వం - మంత్రి కొల్లు రవీంద్ర




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో 64 లక్షల పింఛన్లు అందజేసి పేద ప్రజలను ఆదుకుంటున్నామని రాష్ట్ర గనులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం ఉదయం మచిలీపట్నం మండలంలోని తాళ్లపాలెం గ్రామంలోని స్నేహాలయ వృద్ధాశ్రమంలో, మచిలీపట్నం నగరంలోని చిలకలపూడిలో మంత్రివర్యులు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావులతో కలసి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. తొలుత తాళ్లపాలెం గ్రామంలోని 13వ వార్డులో దివ్యాంగులు వేదాంతం రాజేంద్ర స్వామికి, నత్త దేవ సహాయంలకు 6 వేల రూపాయలు, అమర్లపూడి నారాయణ, కోక వెంకటలక్ష్మిలకు 4 వేల రూపాయల చొప్పున పింఛన్లు అందజేశారు. అనంతరం మంత్రివర్యులు నగరంలోని 7 వ డివిజన్ లో దివ్యాంగులు హరికృష్ణ బాబుకు 10 వేల రూపాయలు, దివ్యాంగురాలు ఆర్జా రుత్వికకు 6 వేల రూపాయలు, మంచానికి పరిమితమై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మన్నేపల్లి అప్పలరాజుకు 15 వేల రూపాయల పింఛన్లను అందజేశారు. అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల 2700 కోట్ల రూపాయలు, సంవత్సరానికి 33 వేల కోట్ల రూపాయలను పేద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్ల రూపంలో అందజేస్తున్నదన్నారు. ఈ విధంగా దేశంలో ఎక్కడా పింఛన్లు ఇవ్వడం లేదన్నారు. గతంలో ఉన్న 3 వేల రూపాయల పింఛన్లు 4 వేల రూపాయలకు పెంచి అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఆగిపోయిన 95 వేల పింఛన్లను తమ ప్రభుత్వం కొత్తగా వచ్చే జూన్ 12వ తేదీన లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నామన్నారు. అందులో జిల్లాకు 2800 కొత్త పింఛన్లు మంజూరయ్యాయన్నారు. పింఛను పొందుతూ భర్తలు చనిపోయిన వారి భార్యలకు మరుసటి నెల



నుండి పింఛన్లు అందజేస్తున్నామన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెసులుబాటు కల్పించుకుని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన మేరకు తల్లికి వందనం పథకాన్ని వచ్చే జూన్ మాసంలో అమలు చేస్తామని, ప్రతి కుటుంబంలో చదువుతున్న పిల్లలందరికీ 15 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని కూడా అమలు చేస్తామన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పింఛన్దారులకు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని వచ్చే ఆగస్టు మాసం 15వ తేదీన ప్రారంభించేందుకు విధివిధానాలు రూపొందిస్తూ, సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీల మేరకు అన్ని హామీలు నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం పేదవారికి అండగా నిలుస్తుందన్నారు. అంతకుమునుపు మంత్రి మంగినపూడి బీచ్ లో మసుల ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. బీచ్ లో ఏర్పాటు చేస్తున్న 100 అడుగుల జాతీయ పతాకం పునాదిని గమనించి ఉత్సవాల ప్రారంభంలోగానే జెండాను ఏర్పాటు చేయాలన్నారు. అమరావతికి ముఖద్వారంగా బీచ్ లో ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. మసులా ఉత్సవాలు ప్రారంభం లోగా అన్ని పనులు పూర్తి చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గంగాధరరావు, మెప్మా పీడీ సాయిబాబు, డి ఆర్ డి ఎ పి డి హరిహరనాథ్, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, తహసిల్దార్ హరినాథ్, స్థానిక ప్రముఖ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, బండి రామకృష్ణ,కుంచే దుర్గాప్రసాద్, మోటమర్రి బాబా ప్రసాద్ తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.




**స్థానిక 45వ డివిజన్ లో పింఛన్లు పంపిణీ చేసిన టీడీపీ డివిజన్ ఇంచార్జి పి వి ఫణి కుమార్, తదితరులు**

-మచిలీపట్నం,కలంకౌంటర్ :

# మజ్జిగ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో జయవరపు ప్రసాద్,గాదె వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# మాలకొండ స్వామి వారి ఆలయానికి పోటెత్తిన భక్తులు

## స్వామివారికి భారీ ఆదాయం రూ 11,92,209/-లు



**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాలెం మండలం లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు స్వామివారి దర్శనానికి పోటెత్తారు. వేకో జాము నుంచి స్వామి వారి దర్శనానికి క్యూలైన్లో భక్తులు బారులు తీరారు. స్వామివారికి భారీ ఆదాయం రూ 11,92,209/-లు వచ్చాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.వి సాగర్ బాబు తెలిపారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, అష్టోత్తరం, హెూమం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు పొంగులు పెట్టుకొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వేలాది భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో సాగర్ బాబు దగ్గరుండి పర్యవేక్షించారు. ఆలయంలో 9 వివాహాలు జరిగాయి. 5000 మంది పైగా స్వామివారి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. అన్న ప్రసాదానికి భారీగా 2,33,214/-రూ విరాళాలు వచ్చాయి.

# యోగాంధ్ర కార్యక్రమం లో మంత్రి కొల్లు,కలెక్టర్ బాలాజీ





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో భాగంగా మంగినపూడి బీచ్ లో ఏర్పాటు చేసిన యోగ కార్యక్రమం లో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర , జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ,జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ , జిల్లా ఎస్పీ గంగాధరరావు, డిఆర్ఓ చంద్రశేఖర రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com